కాంగ్రెస్ కార్యకర్తలుగా

## పోలీసులు పని

**-కాంగ్రెస్ కు ఓటు అడిగే నైతిక హక్కు లేదు**

**-ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి**



**టి మీడియా, డిసెంబర్ 15,గరిడేపల్లి:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కొందరు ఎస్సైలు చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం గరిడేపల్లి మండలం పొనుగోడు, గడ్డిపల్లి, కుతుబ్షాపురం గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. చింతలపాలెం, గరిడేపల్లి పరిధిలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఉదయం

మిగతా 2లో

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 17
సంచిక : 97
పేజీలు : 3

మంగళవారం, డిసెంబర్ 16, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# ఇంటికే యూరియా

## ఒక్క బుకింగ్‌తో -ప్రత్యేక మొబైల్ యాప్ -మంత్రి తుమ్మలనాగేశ్వరరావు


**తెలంగాణ రైతులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రైతులు యూరియా కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే ముందుగానే యూరియా బుక్ చేసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకురానుంది. రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని, ఎరువుల పంపిణీ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ యాప్‌ను ఈ నెల 20 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.**



**ఇంటికే యూరియా**

**టి మీడియా, డిసెంబర్ 15 , ఖమ్మం :** రబీ ముందస్తు ప్రణాళికపై రాష్ట్ర, జిల్లా వ్యవసాయ ,ఉద్యానశాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా అధిక వినియోగం వల్ల జరుగుతున్న నష్టాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, పంట కోత తర్వాత అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణం, భూమి సారంపై కలిగే దుష్పరిణామాలను రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన, కోఆపరేటివ్ శాఖల అధికారులు సమన్వయంతో ఒక టీమ్‌లా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.రైతుల విలువైన సమయం వృథా కాకుండా ఉండేందుకు, కేవలం ఎరువుల పంపిణీ కోసం ఈ కొత్త మొబైల్ యాప్‌ను తీసుకువస్తున్నట్టు మంత్రి తెలిపారు. యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని డీలర్ వద్ద మాత్రమే కాకుండా, జిల్లా పరిధిలోని ఇతర డీలర్ల వద్ద ఉన్న యూరియా స్టాక్ లభ్యతను కూడా తెలుసుకోవచ్చు. అవసరమైన యూరియా పరిమాణాన్ని తమకు అనుకూలమైన డీలర్ వద్ద నుంచే ముందుగా బుక్ చేసుకునే అవకాశం ఈ యాప్‌లో కల్పించనున్నారు.యూరియా బుకింగ్ చేసిన తర్వాత రైతుకు ప్రత్యేక బుకింగ్ ఐడీ అందుతుంది. ఆ బుకింగ్ ఐడీ ఆధారంగానే డీలర్ యూరియాను విక్రయించాల్సి ఉంటుంది. రైతు లేదా అతని ప్రతినిధి వద్ద ఉన్న బుకింగ్ ఐడీ, బుక్ చేసిన పరిమాణాన్ని ధృవీకరించిన తర్వాత మాత్రమే యూరియా ఇవ్వాలని డీలర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయనున్నారు.బుకింగ్ సమయంలో రైతు పంట పేరు, సాగు విస్తీర్ణం మాత్రమే నమోదు చేస్తే సరిపోతుంది. నమోదు చేసిన వివరాల ఆధారంగా వ్యవస్థ స్వయంచాలకంగా రైతుకు అర్హమైన మొత్తం యూరియా పరిమాణాన్ని లెక్కిస్తుంది. అలాగే, 15 రోజుల వ్యవధిలో ఒకటి నుంచి నాలుగు దశలుగా యూరియా అందుకునే విధంగా యాప్‌లో వివరాలు కనిపిస్తాయి. ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచనున్నట్టు మంత్రి తెలిపారు.పాస్‌బుక్ లేని రైతులు ఆధార్ ఆధారంగా నమోదు చేసుకునే అవకాశం ఉండగా, కౌలు రైతులకు కూడా యాప్‌లో ప్రత్యేక సౌకర్యం కల్పించారు. కౌలు రైతులు తమ వివరాలు నమోదు చేసి, భూ యజమాని ఆధార్ ధృవీకరణతో యూరియా బుకింగ్ చేసుకునే వీలుంటుంది. అవసరమైతే, యూరియా బుకింగ్ కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ

మిగతా 3లో






## సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు

**-సీపీ సునీల్ దత్**

**టి మీడియా, డిసెంబర్ 15 , ఖమ్మం :** మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 63 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మూడో విడుత పోలింగ్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామని,

మిగతా 3లో

# తుది విడతకు ఏర్పాట్లు




**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**టి మీడియా,డిసెంబర్ 15, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు, అల్లపల్లి, గుండాల, టేకులపల్లి మండలాల్లో ఎన్నికలు పూర్తిస్థాయిలో, ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఈ మేరకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి మరియు రెండవ విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. గత విడతల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తుది విడతలో ఎటువంటి లోపాలకు తావు లేకుండా ఖచ్చితమైన ప్రణాళికతో ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

రేపు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి పంపిణీ జరగనున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అల్లపల్లి మండలానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గుండాల మండలానికి టిటిడబ్ల్యుఆర్‌జేసీ బాలుర పాఠశాల, జూలూరుపాడు మండలానికి జెడ్పిహెచ్ఎస్, లక్ష్మీదేవిపల్లి మండలానికి ప్రశాంత్‌నగర్ జీపీ పరిధిలోని శ్రీరామ చంద్ర డిగ్రీ కాలేజ్ వద్ద, సుజాతనగర్ మండలానికి జిల్లా పరిషత్ హై స్కూల్, సుజాతనగర్ వద్ద, టేకులపల్లి మండలానికి గోల్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ హై స్కూల్, టేకులపల్లి వద్ద, అలాగే ఎల్లందు మండలానికి ఎస్‌సీసీఎల్ హై స్కూల్, ఎల్లందు వద్ద డిస్ట్రిబ్యూషన్

మిగతా 2లో



# సైబర్ క్రైమ్ యాప్ పై అవగాహన ఉండాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టీ మీడియా, డిసెంబర్ 15,ఖమ్మం:**ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్‌గా అరెస్ట్ చేస్తామని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ళ మాయమాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో సైబర్ క్రైమ్ కు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి, వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, ఓటిపి లను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు. డబ్బును బదిలీ చేయమని, నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఎటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని అన్నారు. ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ ఖాతాలు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాకింగ్, ఫోటోలు, వీడియోల మార్పు చేయడం, మహిళలు, చిన్నారులపై ఆన్‌లైన్ లైంగిక నేరాలు వంటి అంశాలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో లేదా అసురక్షిత సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో పంచుకోవద్దని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ ప్రొఫైల్ మోసాలు, డిజిటల్ వేదికల్లో అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్, సిఐ నరేష్, ఎస్సై విజయ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తలుగా పోలీసులు పని

నుంచి సాయంత్రం వరకు బైండోవర్ కేసులు పెడుతున్నారని తెలిపారు.తమ నాయకులపై అక్రమ కేసులు పెడితే సహించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన, అరవై ఏళ్ల పాలనలో అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు రెండేళ్ల పాలనలోనూ ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ చేయలేదని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ప్రజలకు కళ్లముందే కనిపిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కాంగ్రెస్ సరిగా అమలు చేయలేకపోతుందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లకు పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.పలుచోట్ల పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని, అమాయకులను వేధిస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు ఎక్కువకాలం నిలవవని అన్నారు. కేసీఆర్‌ను వదులుకున్నామన్న పశ్చాత్తాపం ప్రజల్లో మొదలైందని, మరో రెండేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ప్రజలే చెబుతున్నారని జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, కడియం వెంకట్ రెడ్డి, మాశెట్టి శ్రీహరి, నల్లపాటి భాస్కర్, మేళ్లచెర్వు వెంకటరమణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రచారం

**మూగబోయిన మైకులు**

**టీ మీడియా, డిసెంబర్ 15, తల్లాడ**

మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. మైకులు మూగబోయాయి. గత వారం రోజులుగా జోరుగా ప్రచారాలు నిర్వహించిన, సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల ప్రచార వేళ ప్రచార బృందాలు, వాహనాలు, బ్యానర్లు, గోడ పోస్టర్లు, డిజిటల్ క్యాంపెయిన్ వల్ల భారీగా ఖర్చు చేశారు. గ్రామాల్లో ర్యాలీలు ఇంటింటి ప్రచారాలు, సోమవారంతో ముగిశాయి. మండలంలో ఎన్నికల ప్రచారం ముగియగా, ఆ తర్వాత ప్రలోభాల జాతర జోరందుకుంది. ఒక అభ్యర్థి వెయ్యి రూపాయలు పంచితే, మరొకరు తగ్గదలే అంటూ 2000 పంచుతున్నారు. గత నాలుగు రోజులుగా మద్యం ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు.

**రా రమ్మని ఫోన్లు డిజిటల్ చెల్లింపులు**

మండలానికి చెందిన అనేక మంది ఖమ్మం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడలలో ఉద్యోగాలు చేస్తూ, వివిధ పనులపై ఉన్నారు. ఓటర్లను సొంత ఊళ్ళకు రప్పించడానికి అభ్యర్థులు వారి అనుచరులు, నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు ఇళ్లకు చేరుకోవాలని ఫోన్లు చేస్తున్నారు. ఓటుకు నోటుతో పాటు రాకపోకలకు అయ్యే ఖర్చులను గూగుల్ పే ద్వారా చెల్లిస్తున్నారు. ఓ గ్రామానికి చెందినవారు సుమారు 50 మంది హైదరాబాద్లో ఉండటంతో, వారిని కలిసి, ఓట్లు వేయడానికి వచ్చేలా, ప్రయత్నించారు. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీలో 7898 మంది ఓటర్లు ఉన్నారు.

# పాలన పారదర్శకతకు సీపీఐ(ఎం) కు పట్టంకట్టండి



**సిపిఎం సర్పంచ్ అభ్యర్థులను గెలిపించండి - సీపీఐ(ఎం) నేత పోతినేని**

**టీ మీడియా, డిసెంబర్ 15, సింగరేణి (కారేపల్లి) :** ప్రతినిత్యం ప్రజల వెంటే ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కు పనిచేస్తున్న సిపిఐ(ఎం) గెలిస్తే పంచాయతీ పాలనలో పారదర్శకత అవినీతి రహిత అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. సోమవారం సింగరేణి మండలం చీమలపాడు బాజు మల్లయిగూడెం గ్రామపంచాయతీలలో సిపిఎం విజయాన్ని కాంక్షిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. సిపిఎం ప్రదర్శనలో గ్రామాలు మారుమోగాయి. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు, పోడు భూముల సమస్యల పరిష్కారంకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తు పేదలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అండగా ఉంటున్న సిపిఐ(ఎం) అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఎర్రజెండాను కాపాడుకోవటం ద్వారానే పేదల పై పాలకుల వివక్షతను ఎండగట్టొచ్చాన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రతినెల రూ.2500 ఇస్తామని, ప్రతి వ్యవసాయ కూలీకి ఏడాది కి రూ. 12 వేలు ఇస్తామని, ఆసరా పెన్షన్ రూ. 4 వేలకు పెంచుతామని, పెండింగ్ పోడు భూములన్నింటికీ పట్టాలిస్తామని, గిరిజనేతరుల పోడుకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలైనా వాటిని నిలుపుకోలేదని విమర్శించారు.స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ ను ఓడిస్తేనే వాగ్దానాలు అమలు అవుతాయని తెలిపారు. ఇప్పటికైనా చేసిన వాగ్దానాలు అన్నింటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) తరఫున పోటీ చేస్తున్న చీమలపాడు సర్పంచ్ అభ్యర్థి అజ్మీర జ్యోతి శోభన్ రింగు గుర్తు, బాజుమల్లాయిగూడెం సర్పంచ్ అభ్యర్థి బచ్చలి స్వర్ణలత బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్ల ను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, మెరుగు రమణ మండల నాయకులు యనమనగండ్ల రవి, వల్లపు కొండలరావు, మద్దెల నాగయ్య, బాదావత్ శ్రీను, ఎరిపోతు భద్రయ్య, పాల్గొన్నారు.

## తుది విడతకు

కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రేపు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఓటర్ రిజిస్టర్లు, ఎన్నికల స్టేషనరీ తదితర సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి క్రమబద్ధంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజనం, విద్యుత్, స్ట్రాంగ్ రూమ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సామాగ్రి తరలింపుకు అవసరమైన వాహనాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, ఎటువంటి ఆలస్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో రద్దీ ఏర్పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ రిజిస్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరును రిజిస్టర్‌తో సరిపోల్చి ధృవీకరించిన అనంతరమే ఓటు వేయడానికి అనుమతించాలని, దొంగ ఓట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను తప్పనిసరిగా అమలు చేసి, వీడియో కెమెరాల ద్వారా బ్యాలెట్ బాక్సులను నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి, నిర్ణీత రూట్ మ్యాప్ ప్రకారం సురక్షితంగా తరలించాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ పేపర్లను స్ట్రాంగ్ రూమ్లో మాత్రమే భద్రపరచాలని, ఎటువంటి నిర్లక్ష్యం వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, రెండు వేలకుపైగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించాలని సూచించారు. కౌంటింగ్ హాళ్లలో అవసరమైనన్ని టేబుళ్లు ఏర్పాటు చేసి, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి భోజనం, తాగునీరు, రవాణా తదితర అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖలకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తుది విడత పంచాయతీ ఎన్నికలు పూర్తిగా విజయవంతమయ్యేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మూడో విడతకు

# సర్వం సిద్ధం

- 168 జీపీలు, 1372 వార్డులకు ఎన్నికలు : కలెక్టర్

**టీ మీడియా, డిసెంబర్ 15,సత్తుపల్లి**

ఈనెల 17న జరుగనున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు, సింగరేణి మండలాల పరిధిలో ఉన్న 191 గ్రామ పంచాయతీలు, 1742 వార్డులకు మూడో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు గతంలో నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్లు స్వీకరించామన్నారు. మూడో విడతలో ఒక జీపీ, 9 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదని, 22 గ్రామ పంచాయతీలు, 361 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 168 గ్రామ పంచాయతీలకు మొత్తం 485 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1372 వార్డులకు మొత్తం 3369 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. 2091 బ్యాలెట్ బాక్సులు, 2092 పోలింగ్ అధికారులు, 2637 మంది ఓపిఓలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. పైన తెలిపిన గ్రామ పంచాయతీల పరిధిలో 31 లొకేషన్స్ లోని 318 సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఆయా సమస్య సమస్యాత్మక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 2 లక్షల 44 వేల 283 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కలెక్టర్ తెలిపారు.



# నైపుణ్యతతో విజయాలు సొంతం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వైఫల్యాల నుంచి పాఠాలు
- నేర్చుకున్నప్పుడే విజయాలు దరి చేరుతాయి
- కేంద్రీయ విద్యాలయంలో ఇన్నోవేషన్ అండ్ స్కిల్ సెంటర్ ప్రారంభం

**టీ మీడియా, డిసెంబర్ 15,ఖమ్మం:**

విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యతను పెంచుకుంటే జీవితంలో విజయాలు సొంతం అవుతాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పోలేపల్లి షిరిడి సాయినాథ్ నగర్ భద్రాద్రి కాలనీలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఇన్నోవేషన్ అండ్ స్కిల్ సెంటర్ ను ప్రారంభించి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యున్నత విద్యను ప్రభుత్వ రంగంలో అందించే సంస్థలుగా కేంద్రీయ విద్యాలయాలకు మంచి పేరు ఉందని, కేంద్రీయ విద్యాలయాలలో అడ్మిషన్ల కోసం కలెక్టర్‌గా తనకు అనేక దరఖాస్తులు వస్తాయని, ఈ విద్యాలయంలో చదవాలని బయట మంచి డిమాండ్ ఉందని అన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో చదివేందుకు అవకాశం వచ్చిన ప్రతి విద్యార్థి అదృష్టవంతుడని, చిన్నతనంలో తనకు ఇటువంటి మంచి విద్యాలయాల్లో చదువుకునే అవకాశం లభించలేదని కలెక్టర్ తెలిపారు. మన దగ్గర ఉన్న సదుపాయాలను ఎంత మెరుగ్గా వినియోగించుకుంటా మనే దానిపై మన సక్సెస్ ఆధారపడి ఉంటుందని కలెక్టర్ అన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో చదివే విద్యార్థులు క్రీడలలో, అకడమిక్స్‌లో సమాంతరంగా రాణిస్తున్నారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. దేశంలో మంచి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారి సమగ్ర అభివద్ధికి కేంద్రీయ విద్యాలయాలు దోహద పడుతున్నాయని అన్నారు.

అంతకుముందు పీఎం శ్రీ కేంద్రీయ పాఠశాల చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్, టీచర్లు నసీరుద్దీన్ బాబా, సిహెచ్. నరేంద్ర కుమార్, అనిల్ భట్, తన్మాయి, ఊర్మిళ, విభాష, మమత, త్రినేత్ర తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్ ఎన్నికలో హైడ్రామా

### నాలుగు గంటలువార్డు సభ్యులు నిరసన

**టి మీడియా, డిసెంబర్ 15 ,ఖమ్మం రూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు గ్రామంలో ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి మధ్యాహ్నం నుంచి హైడ్రామా కొనసాగుతుంది. ఆదివారం తల్లంపాడు గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిపై స్వల్ప ఓట్ల తేడాతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థికి 167 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థికి 156 ఓట్లు రావడం జరిగింది. కౌంటింగ్‌లో పొరపాట్లు జరిగాయని పేర్కొంటూ బీఆర్ఎస్ కూటమి శ్రేణి నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. చివరకు అధికారులు కాంగ్రెస్ పార్టీ ఓటమి అభ్యర్థి కుమ్మరి అంబేద్కర్ విజయం సాధించినట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుందని గెలుపొందిన వార్డు సభ్యులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చారు.దీంతో అనుకున్న సమయానికి బీఆర్ఎస్ కూటమికి చెందిన వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావడం జరిగింది. అయితే కాంగ్రెస్ పార్టీ కూటమి నుంచి సర్పంచ్ వార్డు సభ్యులు రాకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నిక జరపకుండా అధికారులు జాప్యం చేశారు. మెజారిటీ వార్డు సభ్యులు హాజరైనప్పటికీ ఉప సర్పంచ్ ఎన్నిక చేపట్టకపోవడంతో అధికారుల తీరును నిరసిస్తూ వార్డు సభ్యులు మధ్యాహ్నం నుండి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం ఆర్డీఓ గ్రామానికి చేరుకున్న సమయంలో కారుకు అడ్డంగా పడుకుని మరోసారి వార్డు సభ్యులు నిరసన తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా గ్రామానికి చేరుకుని బందోబస్తు చేపట్టారు.



### మంత్రి ఉత్తమ్ సహకారంతో

## అభివృద్ధికి కృషి

**టీ మీడియా, డిసెంబర్ 15, మఠంపల్లి :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని కృష్ణ తండా గ్రామ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా బానోతు రమాదేవి శంకర్ నాయక్ ను గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. వారు మాట్లాడుతూ, నా మీద నమ్మకంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నన్ను ప్రకటించారు. వారి సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక ప్రకారం అందరికీ న్యాయం చేసేందుకు, ప్రభుత్వం అందించే పథకాలు అందరికీ అందేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్యా మంజీ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు కృష్ణ నాయక్, ఉపసర్పంచ్ శంభయ్య, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటికే యూరియా

అధికారి సేవలను కూడా వినియోగించుకోవచ్చని మంత్రి తెలిపారు.యూరియా పక్కదారి పట్టకుండా, నిజంగా పంట పండించే రైతులకు మాత్రమే ఎరువులు అందించడమే ఈ యాప్ లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. దేశంలో యూరియా అధిక వినియోగం జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటని పేర్కొన్న ఆయన, యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ఇందుకోసం అధికారులు గ్రామస్థాయిలో విస్తృత పర్యటనలు నిర్వహించాలని సూచించారు.అలాగే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. ఈ దిశగా అధికారులు ప్రత్యేక కృషి చేయాలని, రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కిన్నెరసాని పాఠశాల స్వర్ణోత్సవాల ప్రణాళిక

### -ఇప్పటివరకు 40 బ్యాచ్‌ల టెన్త్ ఉత్తీర్ణులు

**టీ మీడియా, డిసెంబర్ 15,పాల్వంచ:** కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సోమవారం కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాల ప్రాంగణంలో ప్రణాళిక సమావేశం నిర్వహించారు. 1975 సంవత్సరంలో ప్రత్యేకంగా గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా, రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన గురుకుల విద్యా విధానంతో, అద్భుతమైన అటవీ క్షేత్ర ప్రాంతమైన కిన్నెరసానిలో ఈ పాఠశాల స్థాపించబడింది. పేద, బడుగు, గిరిజన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే దూరదృష్టితో అప్పటి విద్యావేత్తలు ఈ విద్యాసంస్థను ప్రారంభించారు. ఈ గురుకుల పాఠశాల నుంచి ఇప్పటివరకు 40 బ్యాచ్‌ల టెన్త్ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులై సమాజంలోకి అడుగుపెట్టారు. ఇక్కడ చదువుకున్న గిరిజన విద్యార్థులతో పాటు ఇతర వర్గాల విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, పత్రికారంగ నిపుణులు, స్వయం ఉపాధి వ్యాపారవేత్తలు, వ్యవసాయ రంగంలో స్థిరపడిన రైతులుగా సమాజానికి విశేష సేవలందిస్తున్నారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకొని సమాజ ప్రగతికి దోహదపడుతున్నారు. ఈ చారిత్రాత్మకమైన 50 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.ఈ స్వర్ణోత్సవాలకు సుమారు 3000 మంది పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులు పాల్గొంటారని అంచనా వేస్తూ ఏర్పాట్లపై చర్చించారు. 2026 జనవరి 4వ తేదీ (ఆదివారం) స్వర్ణోత్సవాలను నిర్వహించేందుకు తీర్మానం చేయడంతో పాటు, కార్యక్రమాల నిర్వహణకు వేదికలు, ఏర్పాట్లపై పరిశీలన కూడా చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ స్వర్ణోత్సవాల్లో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్యాం కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జీ. రమేష్, సీనియర్ పూర్వ ఉపాధ్యాయులు ఎన్. చక్రవర్తి, ఎస్.కె. ఖాదర్, రమేష్ రెడ్డి దారావత్ వెంకన్న, పూర్వ విద్యార్థులు రమేష్ రాథోడ్, పీక్ల, పడిగా సత్యనారాయణ, రవి రాథోడ్ శ్రీనివాస్, కత్తి శ్రీను, మాంజ్య కృష్ణ గుగులోత్, రామకృష్ణ, పొడియం వెంకటేశ్వర్లు, రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీస్తు జయంతి జూబ్లీ సెమీ క్రిస్మస్ వేడుకలు

### ముఖ్యఅతిథి కేథలిక్ బిషప్ సగిలి ప్రకాష్

**టి మీడియా, డిసెంబర్ 15 ,ఖమ్మం :** కతోలిక లేటి విభాగం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఫాదర్ కే జోసఫ్ ఆధ్వర్యంలో నాయుడుపేట కరుణగిరిలో జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా క్రిస్మస్ , గీతాలను ఆలపించారు . అనంతరము కేకు కట్ చేసి అందరికీ పంచారు . శ్రీ సభ క్రైస్తవ సంఘములో గృహస్థులకు చాలా విలువ ఉన్నదని వారి ద్వారానే దేవుని యొక్క ప్రణాళిక నెరవేరుతుందని అన్నారు . శ్రీ సభ లో వారికి ఎంతో ప్రత్యేకమైన స్థానం వాటికన్ మహాసభ ఇచ్చినది . కావున ఇకనుండి వారు ప్రతి అంశములోనూ ఎక్కడా తక్కువ కాకుండా వారికి ప్రాముఖ్యత స్థానం ఉందని ఫాదర్లు , గృహస్థ క్రైస్తవ నాయకులు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్లు ఐసాక్ , కాకుమాను రాజు , సురేష్ , చిన్నపరెడ్డి , విజయ్ , టి శౌరి , క్రైస్తవ సంఘ నాయకులు ఎం ప్రసాద్ , కే ప్రసాద్ , సాల్మన్ , సుదర్శనం , మోహన్ రావు , జనార్ధన్ , వీరబాబు , జయరాజు, మోహన్ రావు , నాగరాజు , ప్రభాకర్ , బాలస్వామి , రామకృష్ణ , బాబురావు , ఆనందరావు , తదితరులు పాల్గొన్నారు.



## ధనుర్మాస మహోత్సవాలు

**టీ మీడియా, డిసెంబర్ 15,పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత పాలవంచలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ అలమేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయములో మంగళవారం నుంచి జనవరి 14, 2026 వరకు(16-12-2025 నుండి 14-01-2026 వరకూ) ధనుర్మాస మహోత్సవములు అత్యంత వైభవోపేతముగా నిర్వహించనున్నారు. ఈ ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం 06:00లకు స్వామి వారికి పంచామృతాభిషేకము, సాయంత్రం 6 గంటల నుండి ధనుర్మాస మహోత్సవములు ప్రారంభము.ప్రతిరోజు ఉదయం 04: 30 గంటలకు సుప్రభాతము, ఆరాధన, అనంతరం 05:30 నిమిషాల నుండి తిరుప్పావై సేవా కాలము, 06:30 నిమిషాలకు తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించబడతాయి. ప్రతిరోజు ఉదయం స్వామి వారి ఆరాధనలో భక్తుల యొక్క గోత్రనామములతో అర్చన నిర్వహించబడుతుంది. కావున భక్తులంతా ఈ ధనుర్మాస మహోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుతున్నాము.



## కాంగ్రెస్ విజయం తోనే గ్రామాల అభివృద్ధి

### సింగరేణి మండలం లో వైరా ఎమ్మెల్యే ప్రచారం

**టీ మీడియా, డిసెంబర్ 15, సింగరేణి (కారేపల్లి):** కాంగ్రెస్ తోనే గ్రామపంచాయతీ అభివృద్ధి సాధ్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలం లో కాంగ్రెస్ సర్పంచుల అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. విశ్వనాథపల్లి నుండి ప్రారంభమైన ప్రచారం భజ్యా తండా, రావోజీతండా, పేరుపల్లి, గేట్ కారేపల్లి, గంగారం తండా వరకు సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల కాంగ్రెస్ నెరవేర్చిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో ధాన్యం మొక్కజొన్న పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ధాన్యం రైతులకు బోనస్సు అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామాలలో సమస్యల పరిష్కార దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులేస్తుందని దాన్లో భాగంగా సిసి రోడ్లు సైడ్ డ్రైనేజీలు నిర్మాణం చేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు, గిరిజన తండాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. మూడో విడత ఎన్నికలలో కూడా వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ గణ విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు

మద్యం, డబ్బులు, కానుకల పంపిణీపై ప్రత్యేక బృందాలు దృష్టి సారించాయన్నారు. పౌరులు నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికలకు ఎక్కడైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ మొదలు ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేంత వరకు కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని తెలిపారు. ఆరు మండలాలకు 8 మంది ఏసీపీలు, 20 మంది సిఐలు, 87 మంది ఎస్ఐలు, 17 వందల మంది సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పహారా, నిఘా బృందాలు, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 78 రూట్ మొబైల్ పార్టీలు, 15 ఎఫ్ఎస్టీ బృందాలు, 30 ఎస్ఎస్టీ బృందాలతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బృందాలతో పికెటింగ్ నిర్వహించి అప్రమత్తంగా. ఉన్నామని, ఎక్కడా గొడవలు జరగకుండా పోలీస్ బృందాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు, సమస్యలను సృష్టించే వారిని ముందస్తు బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఉండాలని అన్నారు. సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు.